


RNI.NO.APTEL16333-TC

ప్రశ్నించడం అందరి హక్కు...

# పెన్ సత్తా

PEN SATTA Telugu Daily





అనకాపల్లి సంపుటి: 1 సంచిక: 299 బుధవారం 24-4-2024 ఎడిటర్ : చింతమనేని అనీల్ కుమార్ పేజీలు : 4 వెల : 3.00


# ఎన్నికల నియమావళి అతిక్రమణలను తెలియజేయండి

**- కంట్రోల్ రూమ్ ఫోన్ నం.08924 226599 కు ఫోన్ చేయాలి - ఎం.సి.సి. నోడల్ అధికారి బి.ప్రసాద్**

అనకాపల్లి పెన్ సత్తా ఏప్రిల్ 23: సార్వత్రిక ఎన్నికల నియమావళిని సంపూర్ణంగా అమలు చేసేందుకు ప్రజలు కూడా సహకరించాలని ఎం.సి.సి. నోడల్ అధికారి బి.ప్రసాద్ కోరారు. నియమావళి అమలుకు ఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్ లు జిల్లా అంతటా నిరంతరం నిఘా పెట్టి వీడియోలు తీస్తున్నట్లు ఆయన చెప్పారు. అదే విధంగా పోలీసు, ఎక్సైజ్ అధికారులు నిరంతరం నిఘాలో సారా, గంజాయి, మత్తు పదార్థాలు పట్టుబడుతున్నాయని తెలిపారు. అయితే ఎక్కడైనా నియమావళి ఉల్లంఘనలు జరుగుతున్నట్లు లేదా జరిగే అవకాశం ఉన్నట్లు తెలిసిన వెంటనే కంట్రోల్ రూమ్ ఫోన్ నం 08924 226599 కు ఫోన్ చేయాలని అయన కోరారు. ఫోన్ కాల్ అందుకున్న వెంటనే ఫ్లైయింట్ స్క్వాడ్ టీమ్ లు రంగంలోనికి దిగుతాయన్నారు. అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీల నిర్వహణ, నిషిద్ద ప్రాంతాలైన ప్రార్థనా స్థలాలలో, కులాలు, మతాల వారీగా సమావేశాలు నిర్వహించడం, కానుకలు అందజేయడం, విలువైన ఆభరణాలు, ఉపకరణాలు పంచడం, ప్రలోభాలకు, ఆకర్షణలకు గురిచేయడం మొదలైన చర్యలు ఎవరు చేపట్టినా వెంటనే తెలపాలన్నారు. డబ్బు, సారా, గంజాయి మొదలైన మత్తు పదార్థాలు నిల్వ చేయడం లేదా సరఫరా చేయడం నేరమని వాటి ఆచూకీ తెలిసిన తక్షణం ఫోన్ చేయవచ్చన్నారు. అనుమతి లేని బ్యానర్లు, హోర్డింగ్ లు, కరపత్రాలు, గోడపత్రికలు, ఫ్లెక్సీలు నిషిద్ధమని చెప్పారు. అనుమతి లేని ప్రాంతాలలో ప్రసంగాలు చేయడం, ప్రజలకు ఇబ్బంది కలిగేలా పెద్ద శబ్దాలతో లౌడ్ స్పీకర్లలో ప్రచారం చేయడం, ప్రజలను పదే పదే ఒత్తిడి చేయడం, పరోక్షంగా హెచ్చరికలు చేయడం కూడా నిబంధనలను ఉల్లంఘించమేనని చెప్పారు. కాబట్టి బాధ్యతగల పౌరులందరూ వారి దృష్టికి వచ్చిన, గుర్తించిన అతిక్రమణలు గూర్చి వెంటనే కంట్రోల్ రూమ్ తెలియజేయాలన్నారు.

# కన్యకా పరమేశ్వరి అమ్మవారి ప్రతిష్ఠా శతజయంతి ఉత్సవాలు






అనకాపల్లి పెన్ సత్తా ఏప్రియల్ 23: పట్టణంలో ప్రసిద్ధి చెందిన కన్యకా పరమేశ్వరి దేవస్థానం ఆధ్వర్యంలో అమ్మవారి ప్రతిష్ఠా శతజయంతి ఉత్సవాలు చైత్రమాసం3 వ పౌర్ణమి మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవ విగ్రహానితో నగర సంకీర్తన, గోపూజ, ప్రదక్షిణలు, అమ్మవారికి మూల విరాట్ కు పంచామృత అభిషేకం, నవకలశ స్నపనము, కార్యక్రమము, నీరాజన మంత్ర పుష్పములు, తీర్థ ప్రసాదములు ఘనంగా జరిగాయి. రేజేటి రమాణా చార్యులు ఆధ్వర్యంలో ఆలయ మండపంలో అమ్మవారికి శాంతి హోమం నిర్వహించారు. తిమ్మా పాత్రుడు చక్రవర్తి, శ్రీ వాగ్గేయ వరదాయని బృంద సభ్యులచే అన్నమాచార్య సంకీర్తనలు, కోలాటము భక్తులు ఎంతగానో ఆకట్టుకుంది ఈ కార్యక్రమంలో ప్రతిష్ట, శత జయంతి ఉత్సవముల చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషు కుమార్, ఆలయ అధ్యక్షులు బిళ్ళపాటి కృష్ణ కుమార్, కార్యదర్శి కొరుఫోలు జగదీశ్వర రావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ వుప్పల శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు, తదితరులు పాల్గొన్నారు.





# ఆంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు

చోడవరం పెన్ సత్తా ఏప్రిల్ 23: మండలం లోని అభయ ఆంజనేయస్వామి ఆలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు జరిపారు. చైత్ర పౌర్ణమి సందర్భంగా హైదరాబాద్ ప్రాంతంలో హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహిస్తారు. అదేవిధంగా కొన్ని ఆలయాల్లో హనుమాన్ జయంతి వేడుకలు, ప్రత్యేక పూజలు జరిపారు. మన ఆంధ్రాలో మే 1 న హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహిస్తారు. కాగా, చోడవరం లోని శివాలయం ప్రాంగణంలో ఉన్న ఆంజనేయ స్వామి గుడి వద్ద, ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉన్న ఆంజనేయ స్వామి ఆలయం వద్ద, వ్యాపార వీధిలో ఉన్న ఆంజనేయస్వామి గుడి వద్ద తదితర ప్రాంతాల్లో ప్రత్యేక పూజలు జరిపగా, ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద అన్న సమారాధన ఏర్పాటు చేశారు.



## ఎక్కువ నగదు విలువైన వస్తువులతో ప్రయాణించ వద్దు

**- గ్రీవెన్స్ కమిటీ కన్వీనర్ ఎల్.డి.యం. సత్యనారాయణ**

అనకాపల్లి పెన్ సత్తా ఏప్రిల్ 23: జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో వున్నందున ఎక్కువ మొత్తంలో నగదు, విలువైన ఆభరణాలు వస్తువులతో ప్రయాణాలు చేయవద్దని గ్రీవెన్స్ కమిటీ కన్వీనర్ ఎల్.డి.యం. సత్యనారాయణ తెలిపారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో జిల్లా గ్రీవెన్స్ కమిటీ ఏర్పాటు చేసినట్లు, కమిటీ ఎఫ్.ఎస్.టి., ఎస్.ఎస్.టి టీమ్ ల వారిచే సీజ్ చేయబడిన, ఏ పార్టీ కి చెందనివి, ప్రజలు తమ అవసర నిమిత్తం తీసుకు వెళ్తున్న నగదు, వస్తువులు, తగిన ఆధారాలతో ఎఫ్.ఐ.ఆర్. నమోదు కాబడని కేసులు మాత్రమే ఈ కమిటీ విచారణ చేస్తుందన్నారు. కనుక ప్రజలు ఈ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకుని తమ అవసర నిమిత్తం ముఖ్యమైన వాటినే తీసుకువెళ్లాలని తెలిపారు. పట్టుబడిన సొమ్ము, వస్తువుల పై తగిన ఆధారాలు చూపించి టీమ్ అధికారులతో స్టేట్ మెంట్ వ్రాయించు కోవాలన్నారు. పిదప జిల్లా గ్రీవెన్స్ కమిటీని సంప్రదించాలని చెప్పారు. ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ (ఫోన్ నం.92901 29847) తెలిపారు.

# మద్యం కోసం మందు బాబులు పడుతున్న ఇక్కట్లు

**- మద్యం దొరకడమే గగనం**




చోడవరం పెన్ సత్తా ఏప్రిల్ 23: మండలం లో మద్యం దొరకక మందు బాబుల ఇక్కట్లు వర్ణనాతీతం ప్రతిరోజు మద్యం తాగేవారు ఉదయం నుండి సాయంత్రం ఎక్కువగా ఆ ఆలోచనతోనే ఉంటున్నారు. మద్యం దుకాణాల వద్ద సినిమా హాల్లో టికెట్ల కోసం బారులు తీరి ఉండే విధంగా ఒకరి మీద ఒకరు పడిపోతూ మద్యం బాటిల్ తీసుకుంటున్నారు. ఎన్నడూ లేని విధంగా మందుబాబులు నానా ఇక్కట్లు పడుతున్నారు. ఎన్నికల సమయం కావడంతో రాజకీయ నాయకులు మద్యాన్ని తమ పరపతితో తీసుకుంటున్నారని అందువలనే సరదాగా సీదగా ఉండే కష్టజీవులకు మద్యం దొరకడం గగనంగా ఉంది. డబ్బులు ఇస్తామని చెప్పినా మద్యం దుకాణాల్లో కావలసిన బ్రాండ్ దొరకకపోగా, ఏదో ఒకటి కావాలన్నా మందుబాబుల దాహం తీరలేని పరిస్థితి నెలకొంది. మద్యం షాపుల్లో సరుకు లేకపోయినా బెల్ట్ షాపుల్లో మాత్రం 24 గంటలు ఏటీఎం కూడా పనిచేయని విధంగా మద్యం పుష్కలంగా దొరుకుతుంది. చోడవరం సివిల్ పోలీసులు ఇటీవల చాలా కేసులు నమోదు చేశారు. చోడవరం పట్టణంలో 5 షాపులు ఉండగా, మండలం లోని మిగిలిన గ్రామాల్లో 9 దుకాణాలు ఉన్నాయి. అలాగే చోడవరం సర్కిల్ పరిధిలో 30 షాపులు ఉండగా, ఎలమంచిలి సర్కిల్ పరిధిలో 24 మద్యం షాపులు ఉన్నాయి. ఎన్నికల సమయం కావడంతో ఉదయం 11 నుండి రాత్రి 9 వరకు అమ్మకాలు జరపవలసి ఉంది. సాధారణ రోజుల్లో అయితే ఈ సమయం రాత్రి 10 వరకు ఉంటాయి. ప్రతి షాప్ కి టార్గెట్ ఉంటుందని, ఆ టార్గెట్ పూర్తి అయితే దుకాణాలు తెరిచి ఉన్నా స్కానర్ పనిచేయడం లేదని అమ్మకాలు జరపడం లేదు. దీనివలన మందుబాబులకు మద్యం బాటిల్ ఎప్పుడు దొరుకుతుందా అని ఆలోచించి మరీ నిరీక్షణ చేస్తున్నారు. ఈ పరిస్థితి గతంలో ఎప్పుడూ లేదని ఎందుకు ఇలా జరుగుతుందో తెలియడం లేదని పలువురు మందుబాబులు ఆవేదన వ్యక్తం చేశారు. రోజంతా కష్టపడి పనిచేసిన వారికి ఆ టెన్షన్ నుండి రిలీఫ్ కావడానికి కాస్త మద్యం ఉంటే సరిపోతుందని, డబ్బులు ఇస్తామన్నా దుకాణాల్లో సరిగా దొరకడం లేదని అంటున్నారు. అయితే ప్రతి దుకాణం వద్ద ఆ షాపు టార్గెట్ ఎంత, ఎంత అమ్మకాలు జరిగాయి, ఇంకా ఎంత స్టాక్ ఉంది, ఉన్న బ్రాండ్లు డిస్ ప్లే పెడితే బాగుండేదని అంటున్నారు. మద్యం దుకాణాల్లో ఇబ్బందులు తట్టుకోలేక చాలామంది బెల్ట్ షాపులపై మొగ్గు చూపిస్తున్నారు. షాపుల్లో మద్యం అందుబాటులో లేకపోవడం వలన బెల్ట్ షాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఒక్కొక్కరికి ఒక్క బాటిల్ మాత్రమే ఇస్తున్నామంటున్నారు. అయితే రాజకీయ నాయకుల వద్ద అన్ని కేసుల ఎలా వచ్చింది, అన్ని గ్రామాల్లో ఉన్న బెల్టు షాపుల్లో అన్ని బాటిల్స్ ఎలా ఉంటున్నాయి అనేది ప్రశ్నార్థకంగా ఉంది. సప్లై తక్కువగా ఉందని చెప్పి డిమాండ్ క్రియేట్ చేస్తున్నారు. దీనివలన బెల్ట్ షాపుల నిర్వాహకులకు కాసులు కురుస్తుండగా మందుబాబులకు జేబీలు చిల్లులు పడుతున్నాయని పలువురు వాపోతున్నారు.

# సీఎం రమేష్ ను గెలిపిస్తేనే చోడవరం అభివృద్ధి



చోడవరం పెన్ సత్తా ఏప్రిల్ 23: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కమలం గుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థిగా సీఎం రమేష్ ను గెలిపిస్తే చోడవరం నియోజకవర్గాన్ని పారిశ్రామిక వాడగా అభివృద్ధి చేస్తామని సీఎం రమేష్ సతీమణి శ్రీదేవి అన్నారు. నియోజకవర్గం లోని చోడవరం లోని పలు గ్రామాలు, బుచ్చయ్యపేట మండలం లోని పి.భీమవరం, కొన్నెంపూడి తదితర గ్రామాల్లో సీఎం రమేష్ కుటుంబ సభ్యులు, స్థానిక బిజెపి నాయకులు ముమ్మరంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ కేంద్రం నిధులతో గ్రామాలను ఎంతో అభివృద్ధి చేసే అవకాశం ఉందని, ఆ అవకాశాన్ని బిజెపికి ఓటు వేసి ప్రజల సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు. చోడవరం నియోజకవర్గం ఇన్చార్జి నాగరాజు నాయుడు మంచి రోడ్లు కావాలన్నా, పరిశ్రమలు రావాలన్నా నాయకుడు సరైన వాడు అయితే ప్రాంతాలు శర వేగంగా అభివృద్ధి చెందుతాయని, ప్రజలు కమలం గుర్తు పై ఓటు వేసి ఎంపీ గా సీఎం రమేష్ ను, సైకిల్ గుర్తు పై ఓటు వేసి ఎమ్మెల్యేగా టిడిపి అభ్యర్థి కే.ఎస్.ఎన్.ఎస్ రాజును గెలిపించాలని కోరారు. ఈ సమావేశాల్లో కన్వీనర్ సుధాకర్ నాయుడు, రాష్ట్ర మహిళా బిజెపి నాయకులు పద్మజ, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈర్లే శ్రీరామమూర్తి, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు కరణం ధర్మ శ్రీ నామినేషన్

**- వైసిపి శ్రేణులు తరలి రావాలి**



చోడవరం పెన్ సత్తా ఏప్రిల్ 23: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను బుధవారం ఉదయం 9 గంటలకు చోడవరంలో నామినేషన్ వేయనున్నానని, పార్టీ క్యాడర్, అభిమానులు, లబ్ధిదారులు తరలిరావాలని స్థానిక ఎమ్మెల్యే, వైసిపి అభ్యర్థి కరణం ధర్మ శ్రీ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బుధవారం ఉదయం 9 నుండి స్థానిక హైస్కూల్ గ్రౌండ్ నుండి భారీగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులుతో ర్యాలీగా స్థానిక తాహసిల్దార్ కార్యాలయానికి వెళ్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు దాఖలు చేస్తానని పేర్కొన్నారు. నియోజవర్గం లోని చోడవరం, బుచ్చియ్యపేట, రావికమతం, రోలుగుంట మండలాల నుండి భారీగా తరలి రావాలని ఆయన కోరారు.

# ప్రభుత్వ పాఠశాలలో విద్యా కుసుమాలు







చోడవరం పెన్ సత్తా ఏప్రిల్ 23: మండలం లోని ప్రభుత్వ పాఠశాలలు 14 ఉండగా, వాటిలో పదో తరగతిలో మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల విద్యార్థులు ఇద్దరు ప్రథమ, ద్వితీయ స్థానం కైవసం చేసుకోగా, చోడవరం గర్ల్స్ స్కూల్ విద్యార్థిని తృతీయ స్థానం సాధించించారు. చోడవరం మండలంలో 14 ప్రభుత్వ పాఠశాలల నుండి 756 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలు వ్రాయగా వారిలో కోపరేటివ్ కాలనీలో గల మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల లో చదువుకున్న ఏం.స్వాతి 585 మార్కులు చేసుకుంది. అలాగే చోడవరం గర్ల్స్ హైస్కూల్లో చదువుకున్న ఏం.నేహ 579 మార్కులు సాధించి తృతీయ స్థానం సాధించింది. మండల విద్యాశాఖ అధికారి ఎన్.జయలక్ష్మి, గర్ల్స్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఐవి రామిరెడ్డి, గర్ల్స్ హైస్కూల్ చైర్మన్ దేవరపల్లి కుమారి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, పలువురు ప్రధానో పాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిఆర్పి కేఎం నాయుడు తదితరులు విద్యార్థులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు

## సంపాదకీయం

# ఉద్రిక్తతల నిలయంగా పశ్చిమాసియా!

20 దమాస్కస్‌లో తమ రాయబార కార్యాలయంపై జరిగిన దాడికి ప్రతీకారంగా ఇరాన్ ఇజ్రాయిల్‌పై డజన్ల కొద్ది క్షిపణులు, డ్రోన్లు కురిపించింది. ఇక ఇజ్రాయిల్ ఏప్రిల్ మొదటి తేదీన ఇరాన్ రాయబార కార్యాలయంపై దాడి చేసి పదమూడు మంది ప్రాణాలు తీసింది. అత్యున్నత హెూదాగల ఇద్దరు ఇరాన్ విప్లవ సైనిక గార్డులు కూడా మరణించిన వారిలో వున్నారు. ఈ దాడి 1961 నాటి వియన్నా ఒప్పందాన్ని ఉల్లంఘించడమే. దేశాల దౌత్య సంబంధాలను నిర్దేశించే ఈ ఒప్పందంతో పాటు రాయబార కార్యాలయాల సంబంధాలపై 1963 వియన్నా ఒప్పందాన్ని కూడా ఈ చర్య అతిక్రమించింది. దౌత్యకార్యాలయాల ప్రాంగణాలపై ఎలాంటి దాడి జరపరాదని ఈ నిబంధనలు స్పష్టంగా నిషేధిస్తున్నాయి. కనుక ఇజ్రాయిల్ చర్యతో పశ్చిమాసియాలోని అత్యంత ఉద్రిక్త పరిస్థితికి అగ్గి ముట్టించినట్టయింది. అక్కడ సంఘర్షణలకు ఆజ్యం పోసింది. పశ్చిమాసియాలో దుండగీడు రాజ్యంగా వ్యవహరిస్తోంది ఇజ్రాయిల్. పాలస్తీనాపై దాని జాతి హత్యాకాండ మొదలై ఇప్పటికి ఆరు మాసాలు దాటుతోంది. 34,000 మందికి పైగా పాలస్తీనియన్లు హతులైనారు. వారిలో అత్యధికులు స్త్రీలూ, పిల్లలే, ఇజ్రాయిల్ దాడులు కేవలం గాజా ప్రాంతానికే పరిమితమై లేవు. పశ్చిమ తీరంలోనూ వందలమంది పాలస్తీనియన్లకు గురిపెట్టి మరీ ప్రాణాలుబలిగొన్నది. సిరియా లెబనాన్ ఇరాక్‌లకూ ఈ దాడిని విస్తరించింది. ఇజ్రాయిల్ ఇంత విచ్చలవిడిగా నిస్సంకోచంగా వ్యవహరిస్తున్నదంటే అమెరికా, నాటో కూటమి సర్వవిధాల బీరుపోకుండా వత్తాసునివ్వడమే కారణం. స్టాకహోంలోని శాంతి పరిశోధనా సంస్థ (ఎస్ఐపిఆర్ఐ) అంచనాల ప్రకారం 2019–2023 మధ్య ఇజ్రాయిల్ ఆయుధాలలో 69 శాతం అమెరికా నుంచే దిగుమతి చేసుకుంది. నిజానికి దమాస్కస్‌లో ఇరాన్ దౌత్య కార్యాలయంపై దాడి చేసేందుకు అమెరికా ఆయుధాలనే ఇజ్రాయిల్ ఉపయోగించుకుంది. నిజానికిది అమెరికా ఆయుధ ఎగుమతి నియంత్రణ చట్టం నిబంధనలకు వ్యతిరేకం. ఈ ఆయుధాలను కేవలం న్యాయమైన ఆత్మరక్షణకే ఉపయోగించాలని ఆ నిబంధనలు చెబుతున్నా అమెరికా పట్టించుకోలేదు. ఆపైన ఇజ్రాయిల్ దాడిని ఖండిస్తూ ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో రష్యా ప్రతిపాదించిన ప్రకటనను బలపర్చేందుకు కూడా అమెరికా బ్రిటన్ ఫ్రాన్స్ నిరాకరించాయి. ఆఖరుకు భారత ప్రభుత్వం కూడా ఈ దాడిపై కేవలం ఆందోళన వ్యక్తం చేసిందే తప్ప ఖండించేందుకు సిద్ధం కాలేకపోయింది. ఈ విధమైన నిష్క్రియా ప్రియత్వమే ఇజ్రాయిల్‌కు కొమ్ములు తెచ్చింది. అది ఇరాన్‌ను దాడికి లక్ష్యంగా చేసుకోవడం ఇదేమీ మొదటిసారి కాదు. ఇరాన్‌పై అనేకసార్లు డ్రోన్లతో దాడికి దిగింది. ఆ దేశ భూభాగంలో హత్యలకూ సైబర్ దాడులకూ పాల్పడింది. 2024 జనవరిలో ఇరాన్ లోని ఒక నగరంలో లోతుగా బాంబులు పాతి వంద మందికి పైగా ప్రజలు మరణించడానికి కారణమైంది. అగ్రశ్రేణి శాస్త్రజులు, ఇంజనీర్లు హత్యగావించబడ్డారు. ఇరాన్ అణుబాంబు తయారు చేయకుండా అడ్డుకోవాలనే సాకుతో సాగిన ఈ కవ్వింపు చర్యలన్నిటికీ అమెరికా ఆశీస్సులతో జరిగినవే. తమ సంస్థకు సంబంధించినంత వరకూ ఇరాన్ అణుబాంబు కలిగి వున్నట్టు చెప్పే సమాచారం గానీ, సంకేతాలు గానీ ఏవీ లేవని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఎఇఎ) డైరెక్టర్ జనరల్ రాఫెల్ గ్రాసీ చాలా తాజాగా ఏప్రిల్ 14నే ప్రకటించారు. అయితే ఈ అంచనా అమెరికాకు గానీ, ఇరాన్‌కు గానీ పట్టదు. ఏదో విధంగా ఇరాన్‌ను కల్లోల పర్చవడమే వాటి లక్ష్యం. ఎందుకంటే పశ్చిమాసియాలో వాటి ఆధిపత్యానికి ప్రధాన సవాలుదారుగా వున్న దేశం అదే. బెంజిమన్ నెతన్యాహూ ఉద్దేశపూర్వకంగానే యుద్ధాన్ని ఎగదోస్తున్నాడు. హమాస్‌ను అణచివేయడంలో ఆయన విఫలం కావడం తప్ప ఇందుకు వేరే కారణం లేదు. దాన్ని నిర్మూలించడమే లక్ష్యమంటూ ఆయన పాలస్తీనియన్లపై మారణకాండ ప్రారంభించాడు. కానీ ఇప్పటి వరకూ బందీలను విడిపించడంలోనూ ఆయన కృతకృత్యం కాలేకపోయారు. అవినీతికీ, అసమర్థతకూ మారుపేరుగా తయారైన నెతన్యాహూ పాలనపై విసుగెత్తివున్న ఇజ్రాయిలీల ఆగ్రహం మరింత పెరగడానికి ఇవన్నీ దారితీశాయి. ఆయన రాజీనామా చేయాలంటూ వేలు లక్షల మంది ఇజ్రాయలీలు నిరంతరాయంగా నిరసనలు తెల్పుతూనే వున్నారు. ఒకసారి ఈ యుద్ధం ముగిస్తే ఇక తాను అధికారంలో కొనసాగడం తథ్యమని నెతన్యాహూకు బాగా తెలుసు. అమెరికా పశ్చిమాసియాలో మోసపూరిత పాత్ర పోషిస్తున్నది, మంటలు చల్లార్చడానికి వచ్చినట్టు నటిస్తూ వాస్తవంలో అగ్నికి ఆజ్యం పోసే పాత్ర నిర్వహిస్తున్నది. అమెరికా మిత్రదేశాలైన బ్రిటన్, వంటివి యుద్ధ విరమణకోసం జోక్యం చేసుకోవాలంటే ఆయా తమ దేశస్తుల నుంచి తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్నాయి. అవి ఇజ్రాయిల్‌కు ఆర్థిక మద్దతు, ఆయుధ సరఫరాలు నిలిపివేయడం ద్వారా ఈ పనిచేయొచ్చు.కానీ ఇజ్రాయిల్ వాటికి నమ్మకమైన మిత్ర దేశం. పశ్చిమాసియాలో వాటి పట్టు నిలబెట్టుకోవడానికి అదే సాధనంగా వుంది. మరో వైపునుంచి చూస్తే అతి త్వరలోనే ఎన్నికలు ఎదుర్కోవాల్సిన ఈ దేశాలలో ప్రజల నుంచి వచ్చే నిరసనలను విస్మరించలేవు కూడా. అందుకే ఇజ్రాయిల్ అదుపు అంటూ ఏదో అభినయిస్తున్నాయి. ఇరాన్ క్షిపణి దాడులపై అమెరికా, యూరోపియన్ యూనియన్ నాటో వంటి వాటి ప్రతిస్పందన మరోసారి వాటి కపటత్వాన్ని బహిర్గతం చేసింది. ఇరాన్ క్షిపణులు లక్ష్యాలను ఛేదించకుండా విఫలం చేయడంలో అమెరికా బ్రిటన్ జోర్డాన్ ప్రధాన పాత్ర వహించాయి. తమ చెక్కుచెదరని నేస్తమైన ఇజ్రాయిల్‌కు మద్దతు నిస్తున్నట్టు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ప్రకటించారు. పైకి మాత్రం ఆ ప్రాంతాన్ని మరింత విస్తృతమైన యుద్ధంలోకి దించే మరే విధమైన తదుపరి చర్యలకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేశాడు. అయితే ఇజ్రాయిల్‌ను కేవలం ప్రకటనలతో బెదిరింపులతో లంగదీయడం కుదిరేపని కాదు. దాని దురాక్రమణ చర్యలు, వలసవాద విస్తరణ చర్యల నుంచి ఇజ్రాయిల్ వత్తాసుదారులందరూ విడగొట్టుకోవడం విస్తారమైన ప్రజా ఒత్తిడితోనే సాధ్యం. అన్ని దేశాలు కూడా దానికి సైనిక రక్షణభద్రతా పరమైన లావాదేవీ లు నిలిపి వేయాలి. ఇజ్రాయిల్ జాతి హత్యాకాండ యుద్ధాన్ని కొనసాగిస్తున్న వారందరిని అంతర్జాతీయ న్యాయస్థానంలో విచారించి శిక్షించాలి. అన్నిటికన్నా ముఖ్యంగా పాలస్తీనా రాజ్యాన్ని, 1967కు పూర్వమున్న దాని తూర్పు జెరూసలేము రాజధానిని గుర్తించాలి. తక్షణ కాల్పుల విరమణ, ఆక్రమిత ప్రాంతాలన్నిటినుంచి ఇజ్రాయిల్ ఉపసంహరణతో ఈ ప్రక్రియ ప్రారంభం కావాలి. పశ్చిమాసియాలో లక్షల మంది భారతీయులు జీవిస్తున్నారు. యుద్ధం ప్రజ్వరిల్లితే వారి జీవితాలే ప్రమాదంలో పడతాయి. భారత ప్రభుత్వం చురుగ్గా జోక్యం చేసుకోవాలి. వారి క్షేమంగా బయిటపడేలా చూడాలి. ఇవేవి జరగాలన్నా–పాలస్తీనియన్లకు మన మద్దతు ఫణం పెట్టి ఇజ్రాయిల్ స్నేహం కోసం పాకులాడే విధానం తలకిందులుగా మారాలి. ఈ పూర్వ రంగంలో మన దేశ నిర్మాణ కార్మికులను ఇజ్రాయిల్‌కు పంపడం అత్యంత ప్రమాదభరతమైన పని. దాన్ని తక్షణం ఆపేయాలి. ఇజ్రాయిల్ కబ్జాకోరు పోకడలను నిర్ద్వంద్వంగా ఖండించి దాంతో రక్షణ భద్రతా ఒప్పందాలను రద్దు చేసుకుని వాటినుంచి వైదొలగాలి. పాలస్తీనాకు సంఘీభావంగా దృఢ వైఖరి తీసుకోవాలి. ఇది రాస్తున్న సమయంలో ఇరాన్ క్షిపణి దాడులకు ప్రతిస్పందన తెల్పుతానని ఇజ్రాయిల్ ప్రతిజ్ఞ వెలువడింది. అయితే అది ఏ రూపంలో వుండేది ఇంకా తెలియలేదు. తమ రాయబార కార్యాలయంపై ఇజ్రాయిల్ దాడికి సమాధానంగానే క్షిపణి దాడులు జరిపామని ఇక ఆది ముగిసి పోయినట్టే భావిస్తున్నానని ఇరాన్ ప్రకటించింది. ఇజ్రాయిల్ మరిన్ని దాడులకు పాల్పడితే ఊరుకోబోనని హెచ్చరించింది. సంయమనం పాటించవలసిందని, మరింత పెరగకుండా చూడాలనీ యావత్ అంతర్జాతీయ సమాజం ఇరు దేశాలకు విజ్ఞప్తి చేసింది. అయితే ఇదంతా ఇజ్రాయిల్ పైన దాని ప్రధాన వత్తాసుదారుడైన అమెరికా మీద ఆధారపడి వుంటుంది.

# శివాలయం వద్ద అన్న సమారాధన




చోడవరం పెన్ సత్తా ఏప్రిల్ 23: స్థానిక స్వయంభూ గౌరీశ్వర స్వామి ఆలయం వద్ద పౌర్ణమి సందర్భంగా పార్వతీ దేవి అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచిలి చలపతి పంచామృత అభిషేకం, సహస్రనామార్చన, కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల్లో వడ్డాది నరసింహమూర్తి పంతులు, వెంకట్, సేవకులు గంగా విష్ణు, మేరపురెడ్డి వెంకట్, నేమాల నర్సింగరావు, కోన అప్పారావు, సాయిరాం, వంకాయల రామారావు, రొంగలి మంగ, నల్లపురాజు లక్ష్మి, రొంగలి దేవి తదితరులు పాల్గొన్నారు.

# జగన్ బాదుడును ప్రజలకు గుర్తుచేయండి




అచ్యుతాపురం: ఐదేళ్లగా జగన్ ప్రభుత్వం సామాన్యులపై బాదుడును ప్రజలకు వివరించాలని తెదేపా జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో మంగళవారం తెదేపా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇసుక లభించకుండా చేసి కార్మికులను రోడ్డుమీదకు లాగి ఆనందం పొందారన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా నిత్యావసర సరకులు, కూరగాయల ధరలు పెరిగిపోయాయన్నారు. విద్యుత్తు ఛార్జీలు, ఆర్టీసీ, మద్యం ధరలు పెంచి పేదల జీవితాలతో వ్యాపారం చేసిన మోసగాడు జగన్ అనే విషయం ప్రజల్లోకి ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. ఈనెల 24న జరిగే సీఎం రమేశ్ నామినేషన్ కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి భారీగా జనాలను తీసుకురావాలని ఆయన కోరారు. ఎలమంచిలి తెదేపా ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జనసేన అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీలు బుద్ధ నాగజదీశ్వరరావు, పీవీఎన్ మాధవ్, భాజపా కన్వీనర్ రాజాన సన్యాసినాయుడు, రాజాన రమేష్‌కుమార్, సీఎం రాజేశ్, డ్రీమ్స్ నాయుడు, డొక్కా నాగభూషన్, రాజాన విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఏఐకి డేటా కంటే విలువైనది ఇదే..



మార్క్ జుకర్‌బర్గ్ అంచనా!

ప్రముఖ టెక్ సంస్థ మెటా ఇటీవల లామా–3 ఏఐ మోడల్స్‌ను విడుదల చేసింది. వాటిని వాట్సప్, మెసెంజర్, ఇన్‌స్టాగ్రామ్‌కు అనుసంధానం చేసింది. ఈసందర్భంగా భవిష్యత్తులో కృత్రిమ మేధ పనితీరును నిర్దేశించబోయే అంశమేంటో సంస్థ సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ వెల్లడించారు. అది డేటా మాత్రం కాదని స్పష్టంచేశారు. "ఏఐ మోడల్‌లో డేటా కంటే ఫీడ్‌బ్యాక్ లూప్‌లు చాలా విలువైనవిగా మారతాయని నా నమ్మకం" అని జుకర్‌బర్గ్ వెల్లడించారు. ఏఐ మోడల్స్‌ను ట్రైన్ చేయడం, మెరుగుపర్చడం కోసం ఫీడ్‌బ్యాక్ లూప్‌లను ఉపయోగిస్తారు. ఇవి గత ఔట్‌పుట్‌ల ఆధారంగా పని చేస్తాయి. తప్పులు జరుగుతున్న సమయంలో ఏఐ మోడల్స్‌కు వాటిని గుర్తు చేసి, అవగాహన కల్పించే అల్గారిథమ్‌లనే లూప్స్‌గా వ్యవహరిస్తారు. పనితీరును మెరుగు పర్చుకోవడానికి కావాల్సిన డేటాను కూడా అవి అందిస్తాయి. ఏఐ మోడల్స్‌ను ఉపయోగించడం, వాటిలోని లోపాలను గుర్తించడం, ఫీడ్‌బ్యాక్ రూపంలో వాటిని అందించి మెరుగుపర్చడమనే ప్రక్రియ భవిష్యత్తులో చాలా విలువైనదిగా మారుతుందని జుకర్‌బర్గ్ వివరించారు. సింథటిక్ డేటా సైతం కీలకపాత్ర పోషిస్తుందని జుకర్‌బర్గ్ అన్నారు. వాస్తవ ప్రపంచంలో ఎదురయ్యే సమస్యల్ని గుర్తించి.. వాటిని పరిష్కరించేందుకు ఉన్న వివిధ పరిష్కార మార్గాలను అన్వేషిస్తారు. వాటిలో ఏది సత్ఫలితాలిస్తుందో కనిపెడతారు. దీనికి సంబంధించిన పూర్తి సమాచారాన్నే సింథటిక్ డేటాగా వ్యవహరిస్తున్నారు. వాస్తవ రూపంలో ఆ సమస్య తలెత్తడం, దాన్ని పరిష్కరించడం జరగకపోయినప్పటికీ.. వాటిని ఊహించుకుని ముందే ఆయా పరిష్కారాలతో ఏఐ మోడల్స్‌కు శిక్షణ ఇవ్వడానికి ఈ సింథటిక్ డేటా ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. చాలా కంపెనీలు ఇప్పుడు దీన్ని అభివృద్ధి చేసే పనిలో ఉన్నాయి.

# జొమాటోలో ప్లాట్‌ఫామ్ ఫీజు పెంపు..




ప్రముఖ ఫుడ్‌డెలివరీ ప్లాట్‌ఫామ్ జొమటో ప్లాట్‌ఫామ్ ఫీజును పెంచింది. ఇక నుంచి ప్రతి ఆర్డర్‌పై రూ.5 చొప్పున దీనిని వసూలు చేయనుంది. ఏప్రిల్ 20 నుంచే పెరిగిన ఫీజు అమల్లోకి వచ్చింది. దేశ రాజధాని ప్రాంతం, బెంగళూరు, ముంబయి, హైదరాబాద్, లఖ్‌నవూ వంటి ప్రధాన మార్కెట్లలో ఇప్పటికే యూజర్ల నుంచి దీనిని వసూలు చేస్తోంది. మరో ఫుడ్ డెలివరీ యాప్ స్విగ్గీ ఇప్పటికే ఒక్కో డెలివరీకి రూ.5 చొప్పున వసూలు చేస్తోంది. జొమాటో తొలిసారి 2023 ఆగస్టులో ప్లాట్‌ఫాం ఫీజును ప్రవేశపెట్టింది. తొలుత ఆర్డర్‌కు రూ.2 చొప్పున వసూలు చేసేది. అక్టోబర్‌లో దాన్ని రూ.3, జనవరిలో రూ.4కు పెంచింది. తాజాగా రూ.5కు చేర్చింది. సాధారణంగా ఫుడ్ డెలివరీ సంస్థలు ఆహారంతో పాటు డెలివరీ ఛార్జీని వసూలు చేస్తాయి. కంపెనీ ఆదాయాన్ని పెంచుకోవడానికి ప్లాట్‌ఫామ్ ఫీజును కొత్తగా ప్రవేశపెట్టాయి. జొమాటోకే చెందిన బ్లింకిట్ ఈ ఫీజును రూ.2 చొప్పున వసూలు చేస్తోంది. ప్లాట్‌ఫామ్ ఫీజు పెంపు నేపథ్యంలో జొమాటో షేరు 2.22 శాతం లాభంతో రూ.193.40 వద్ద ముగిసింది. ఇంటర్‌సిటీ లెజెండ్స్ పేరిట ఒక నగరంలో బాగా ప్రాచుర్యం పొందిన ఆహార పదార్థాలను ఇతర నగరాల్లోనూ సరఫరా చేసే సేవలను జొమాటో తాజాగా నిలిపివేసింది. ఊహించిన స్థాయిలో స్పందన లేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ సేవల విషయంలో న్యాయపరమైన చిక్కులు తలెత్తడమూ మరో కారణమని సంబంధిత వర్గాలు తెలిపాయి. 2022 తొలుత వీటిని ప్రారంభించిన జొమాటో.. తక్కువ సమయంలోనే డెలివరీ చేసేందుకు వీలుగా తమ గోదాముల్లో వీటిని ముందుగానే అందుబాటులో ఉంచుతోంది.

# 233వ స్టోర్‌ను తెలంగాణలో ప్రారంభించిన వెస్ట్‌సైడ్




హైదరాబాద్ : ప్రముఖ భారతీయ కుటుంబం – టాటాలో భాగమైన వెస్ట్‌సైడ్, ఫ్యాషన్ ఔత్సాహికులకు ఆనందాన్ని తీసుకువచ్చే లక్ష్యంతో హైదరాబాద్ లో తమ సరికొత్త స్టోర్‌ను ప్రారంభించింది. వెస్ట్‌సైడ్ హైదరాబాద్, జి ఎస్ సెంటర్ పాయింట్, పంజాగుట్ట, హైదరాబాద్ 500082 వద్ద ఉన్న ఈ స్టోర్ 36,288 చ.అ.లలో విస్తరించి ఉంది. ప్రతి క్షణం స్టైల్‌ను సులభతరం చేసే ఉద్దేశ్యంతో, ఇది దుస్తులు, ఉపకరణాలు, సౌందర్య సాధనాలు, పాదరక్షలు, హెూమ్ అంతటా వెస్ట్‌సైడ్ విభిన్న బ్రాండ్‌లను కలిగి ఉంటుంది ఇవన్నీ ఒకే ప్రదేశంలో సౌకర్యవంతంగా అందుబాటులో ఉంటాయి. ఈ కొత్త స్టోర్ అసాధారణమైన విలువతో వినియోగదారులకు సమకాలీన, ఆధునిక ఫ్యాషన్ ట్రెండ్‌లను సౌకర్యవంతమైన రీతిలో అందించాలనే బ్రాండ్ లక్ష్యం ప్రతిబింబిస్తుంది. సరికొత్త ఫ్యాషన్‌లను హైలైట్ చేసే ఖచ్చితమైన ఏర్పాటుతో, ఆహ్లాదకరమైన డిస్‌ప్లేలతో సౌకర్యవంతమైన షాపింగ్ అనుభవాన్ని అందించడానికి ఇది కట్టుబడి ఉంది. విలక్షణమైన శైలితో, బ్రాండ్ ఆవిష్కరణలను చేయటమే కాదు ప్రతి మూడు వారాలకు శుక్రవారం రోజున తమ కలెక్షన్ మారుస్తుంది. వెస్ట్‌స్టైల్‌క్లబ్ సభ్యత్వంతో మీ షాపింగ్ అనుభవాన్ని పెంచుకోండి, అత్యుత్తమ సేవ, పుట్టినరోజు విందులకు హామీ ఇస్తుంది. మరిన్ని వివరాల కోసం వెస్ట్‌సైడ్.కమ్ ని చూడండి లేదా టాటా సీఎల్ఐక్యూలో వెస్ట్‌సైడ్ ని షాపింగ్ చేయండి.

# ఇనార్బిట్ మాల్ సైబరాబాద్‌లో వేసవి వైభవాన్ని ఆస్వాదించండి..




హైదరాబాద్ : ఇనార్బిట్ మాల్ సైబరాబాద్‌లో మరిచిపోలేని ఏప్రిల్ కోసం సిద్ధమవండి, ఇక్కడ వివిధ రకాల కార్యక్రమాలు, ప్రత్యేకమైన ఆఫర్‌లు, తాజా కలెక్షన్ ఎదురు చూస్తోంది.ఇంతకుముందు వారాంతంలో ఈ మాల్ ప్రపంచ ఎర్త్ డేని జరుపుకోవడానికి, పర్యావరణ అవగాహనను ప్రోత్సహించడానికి ఏప్రిల్ 20, 21 తేదీల్లో టోట్ బ్యాగ్ పెయింటింగ్ వర్క్‌షాప్‌ను నిర్వహించింది. అంతే కాదు, అద్భుతమైన రీతిలో స్ప్రింగ్ డెకర్ సైతం అతిథులను ఆహ్వానిస్తుంది. ప్రతి బిట్ పూర్తిగా ఇన్‌స్టా–విలువైనదిగా ఉండటం దీని విశేషం. సీతాకోకచిలుకలు, వసంత పుష్పాలు, ఆకట్టుకునే తోటల రీతిలో మాల్ అలంకరించారు. రిటైల్ థెరపీ లేకుండా మాల్ సందర్శన ఎప్పుడూ పూర్తి కాదు, షాపర్స్ స్టాప్, లైఫ్ స్టైల్, హెచ్ అండ్ ఎం, పాంటలూన్స్, మ్యాక్స్ అండ్ మరిన్నింటిలో తాజా స్ప్రింగ్ సమ్మర్ కలెక్షన్ ను చూడవచ్చు. చివరగా, కొత్తగా తెరిచిన డైనింగ్ స్పాట్, కేఫ్ ఢిల్లీ హైట్స్ లేదా ఇనార్బిట్ మాల్ సైబరాబాద్‌లో మీకు ఇష్టమైన డైనింగ్ ఆప్షన్‌లలో ఒకదానిలో రుచికరమైన భోజనం చేయండి. ఆహ్లాదకరమైన అనుభవాలను ఇంటికి తీసుకువెళ్ళండి.

# రిలయన్స్ లాభాల్లో 2 శాతం తగ్గుదల




న్యూఢిల్లీ : ముకేష్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండిస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) లాభాలు తగ్గాయి. గడిచిన ఆర్థిక సంవత్సరం (2023-24)లోని మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో 18,951 కోట్ల నికర లాభాలు నమోదు చేసింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.19,299 కోట్ల నికర లాభాలు సాధించింది. దీంతో పోల్చితే గడిచిన క్యూ4 లాభాల్లో 1.8 శాతం తగ్గుదల చోటు చేసుకుంది. కాగా.. కంపెనీ రెవెన్యూ 11.3 శాతం పెరిగి రూ.2,40,715 కోట్లకు చేరింది. కంపెనీ మొత్తం వ్యయాలు 11.45 శాతం పెరిగి రూ.2,17,529 కోట్లుగా నమోదయ్యాయి. ఆర్ఐఎల్ 2023-24కు గాను రెండో సారి డివిడెండ్‌ను ప్రకటించింది. ప్రతీ ఈక్విటీ షేర్‌పై రూ.10 డివిడెండ్ చెల్లింపునకు ఆ కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది. ఇంతక్రితం రూ.9 డివిడెండ్‌ను చెల్లించింది. ఆర్థిక సంవత్సరం 2023-24లో మొత్తంగా 2.6 శాతం వృద్ధితో రూ.9,14,472 కోట్ల రెవెన్యూ ప్రకటించింది. ఇంతక్రితం ఏడాదిలో రూ.8.91 లక్షల కోట్ల రెవెన్యూ నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.8.09 కోట్లుగా ఉన్న వ్యయాలు.. గడిచిన ఆర్థిక సంవత్సరంలో రూ.9.14 లక్షల కోట్లకు పెరిగాయి. 2023-24లో రూ.79,020 కోట్ల నికర లాభాలు నమోదయ్యాయి. ఇంతక్రితం ఏడాది రూ.73,670 కోట్ల లాభాలు ఆర్జించింది. 2023-24 మార్చితో ముగిసిన త్రైమాసికంలో రిలయన్స్ జియో 13.2 శాతం పెరిగి రూ.5,337 కోట్లకు చేరాయి. ఇంతక్రితం ఏడాది ఇదే క్యూ4లో రూ.4,716 కోట్ల లాభాలు నమోదు చేసింది. గడిచిన క్యూ4లో కంపెనీ రెవెన్యూ 11 శాతం పెరిగి రూ.25,394 కోట్లుగా చోటు చేసుకుంది. 2023-24లో జియో స్థూల రెవెన్యూ 10.4శాతం పెరిగి రూ.1 లక్ష కోట్లను చేరగా.. నికర లాభాలు 11.48 శాతం పెరిగి రూ.20,607 కోట్లుగా నమోదయ్యాయి.


# ఆ మసాలా ఉత్పత్తుల్లో క్యాన్సర్ కారకాలు




ఎవరెస్ట్, ఎండీహెచ్ కంపెనీలకు చెందిన పలు మసాలా ఉత్పత్తులపై సింగపూర్, హాంకాంగ్ నిషేధం విధించిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అలర్ట్ అయింది. ఆయా మసాలా ఉత్పత్తుల్లో క్యాన్సర్ కారక ఇథిలీన్ ఆక్సైడ్ ఉందని సింగపూర్, హాంకాంగ్ గుర్తించిన నేపథ్యంలో ముందుజాగ్రత్త చర్యలను చేపట్టే దిశగా సర్కారు నడుం బిగించింది. మనదేశంలోని అన్ని మసాలా ఉత్పత్తులకు సంబంధించిన శాంపిళ్లను సేకరించాలని భారత సర్కారు సంబంధిత విభాగాలకు ఆదేశాలు జారీ చేసింది. ఈమేరకు దేశంలోని ఫుడ్ కమిషనర్లు అందరినీ అప్రమత్తం చేసింది. ఇప్పటికే అన్ని కంపెనీల మసాలా ఉత్పత్తుల శాంపిళ్ల సేకరణ ప్రక్రియ ప్రారంభమైనట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. మూడు నాలుగు రోజుల్లోగా దేశంలోని అన్ని ప్రముఖ కంపెనీల మసాలా ఉత్పత్తుల తయారీ యూనిట్ల నుంచి శాంపిళ్ల సేకరణ పూర్తవుతుందని తెలిపాయి. వాటిని ల్యాబ్‌కు పంపించాక.. తనిఖీ రిపోర్టు రావడానికి 20 రోజుల టైం పడుతుందని పేర్కొన్నాయి.


ఎవరెస్ట్, ఎండీహెచ్ మసాలా ఉత్పత్తుల్లో 'ఇథిలీన్ ఆక్సైడ్' మూలాలను గుర్తించారు. ఇది 10.7 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువ ఉష్ణోగ్రతల వద్ద మండే స్వభావాన్ని కలిగిన రంగులేని వాయువు అని సుగంధ ద్రవ్యాల బోర్డు నిర్వచించింది. ఇథిలీన్ ఆక్సైడ్ అనేది క్రిమిసంహారకంలా, ధూమపాన ఉత్పత్తిలా, స్టెరిలైజింగ్ ఏజెంట్‌లా ప్రతికూల ప్రభావాలను కలగజేస్తుందని అంటారు. వైద్య పరికరాలను క్రిమిరహితం చేయడానికి, సుగంధ ద్రవ్యాలలోని సూక్ష్మజీవుల కాలుష్యాన్ని తగ్గించడానికి ఇథిలీన్ ఆక్సైడ్‌ను వాడుతుంటారు. దీన్ని సహజ వనరులతో పాటు నీటితో నిండిన నేల, పేడ, బురదల నుంచి ఉత్పత్తి చేయొచ్చు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ)కు చెందిన ఇంటర్నేషనల్ ఏజెన్సీ ఫర్ రీసెర్చ్ ఆన్ క్యాన్సర్ (ఐఏఆర్సీ) ఇథిలీన్ ఆక్సైడ్‌ను గ్రూప్ 1 కార్సినోజెన్‌గా వర్గీకరించింది. అంటే.. దీనివల్ల మనుషుల్లో క్యాన్సర్‌కు కారణమయ్యే రిస్క్ ఉంటుంది.

# గతేదాది అత్యధికంగా అమ్ముడు పోయిన కారు



భారతీయ ఆటోమొబైల్ రంగంలో హ్యాష్‌బ్యాక్ కార్లకు ఉన్న డిమాండ్ ఎలాంటిదో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. మారుతి స్విఫ్ట్, వ్యాగనార్, బలెనో, టాటా ఆల్ట్రోజ్, హ్యుందాయ్ ఐ20, టయోటా గ్లాంజా వంటి కార్లు హ్యాష్‌బ్యాక్ సెగ్మెంట్‌లో అత్యంత ప్రాచుర్యం పొందాయి. హ్యాష్‌బ్యాక్ కార్ల నిర్వహణ తక్కువగా ఉండడం, ధర కూడా అందుబాటులో ఉండడమే ఈ కార్లకు ఉన్న డిమాండ్‌కు కారణంగా చెప్పొచ్చు. 2023-34 ఏడాదికి గాను ప్రీమియం సెగ్మెంట్ హ్యాష్ బ్యాక్ కార్లు ఎక్కువగా అమ్ముడుపోయాయి. గత ఆర్థిక సంవత్సరంలో ప్రీమియం సెగ్మెంట్ హ్యాచ్‌బ్యాక్ కార్ల విక్రయాల్లో మారుతి సుజుకి బలెనో మరోసారి అగ్రస్థానాన్ని సాధించింది. మొత్తం 1,95,660 యూనిట్ల విక్రయాలతో బలెనో మొదటి స్థానంలో నిలిచింది. ఇక రెండో స్థానంలో టాటా ఆల్ట్రోజ్ నిలిచింది. గత ఆర్థిక సంవత్సరం ఈ కారు 70,162 యూనిట్ల విక్రయాలు జరిగాయి. ఇక 69,988 యూనిట్ల విక్రయాలతో హ్యూండాయ్ ఐ20 మూడో స్థానంలో నిలిచింది. 52,262 యూనిట్ల విక్రయాలతో టయోటా గ్లెంజా నాలుగో స్థానంలో నిలిచింది. ఇక బలెనో కారు ఫీచర్ల విషయానికొస్తే ఇది 5 సీటర్ హ్యాష్ బ్యాక్ కారు. 1.2-లీటర్ దుల్జెట్ పెట్రోల్ ఇంజన్‌తో ఈ కారు వస్తుంది. ఇది గరిష్టంగా 90ఎష్ట్రజా పవర్‌ను, 113%చీఎ% గరిష్ట టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. కారు ఇంజన్ 5-స్పీడ్ మాన్యువల్, 5-స్పీడ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ గేర్‌బాక్స్‌తో అందించారు. ఇక మారుతి సుజుకి బలెలోను సీఎన్‌జీ పవర్ ట్రెయిన్ ఆప్షన్‌లో కూడా తీసుకొచ్చారు. ఇక ఈ కారు ఇంటీరియర్ విషయానికొస్తే ఇందులో 9 ఇంచెస్‌తో టచ్ స్క్రీన్‌తో కూడిన ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్‌ను అందించారు.

# జొన్న రొట్టెలు తినడం వల్ల లాభాలు..!



మన చుట్టూ పండేటువంటి వాటిలో కూడా ఆరోగ్యానికి చాలా మేలు చేసే తృణధాన్యాలు కూడా ఉంటాయి. ముఖ్యంగా ఈ ధాన్యాల వల్ల మనకు చాలా లాభాలు కూడా ఉంటాయి. అలాంటి వాటిలో జొన్నలు కూడ ఒకటి. చాలా మంది వీటితో రొట్టెలు వంటివి చేసుకుంటూ ఉంటారు. ఎక్కువగా షుగర్ వ్యాధిగ్రహస్తులు కూడా వీటిని తింటూ ఉంటారు. ఈ జొన్నల వల్ల మనం అధిక రక్తపోటు సమస్యలను మలబద్ధకం ఇతరత్తర సమస్యలను కూడా నివారించుకోవచ్చు. జొన్నలు ఎక్కువగా ఆఫ్రికా వంటి ప్రాంతాలలో ఎక్కువగా పండుతాయి. జొన్న పిండితో తయారు చేసిన వంటలను తినడం వల్ల మరిన్ని లాభాలు కలుగుతాయి. ముఖ్యంగా జీర్ణ క్రియ మెరుగుపడడం గుండెపోటు రాకుండా ఉండడం బరువు తగ్గడం వంటి వాటికి ఉపయోగపడుతూ ఉంటాయి. జొన్నలలో ఎక్కువగా ప్రోటీన్ ఫైబర్ వంటివి లభిస్తాయి. అలాగే యాంటీ ఆక్సిడెంట్లు ఫినాలిక్ సమ్మేళనాలు వంటివి ఈ జొన్నలలో లభిస్తాయి. శరీరంలోని కొండే పేగుల కదలికలను కూడా చురుకుగా చేయడంలో కీలకపాత్ర పోషిస్తాయి. ఫైబర్, గట్ వంటి బ్యాక్టీరియాను అభివృద్ధి చేయడానికి ఈ జొన్నలు సహాయపడతాయి. జొన్నలతో తయారు చేసినటువంటి ఆహారాన్ని తినడం వల్ల ఎముకలు దృఢంగా మారుతాయి. శరీరంలో ఉండే వ్యర్థ కొవ్వు పదార్థాలను నియంత్రించడానికి చాలా సహాయపడతాయి. జొన్న లో ఉండే ఫినాలి యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలో ఉండేటువంటి మంట అధిక ఒత్తిడిని సైతం తగ్గించడానికి సహాయపడతాయి. ముఖ్యంగా జొన్న రొట్టెలను తినడం వల్ల అధిక బరువు సమస్య నుంచి బయటపడవచ్చు ఇందులో ఉండే ఫైబర్ ప్రోటీన్ ల వల్ల ఎక్కువ లాభాలు ఉంటాయి. కాబట్టి ఐదు సంవత్సరాల పైబడిన పిల్లలు కూడా వీటిని తినడం మరింత మంచిది. జొన్న రొట్టెలు కాల్చేటప్పుడు కాస్త నువ్వు గింజలు కూడా రొట్టెల మీద చల్లుకొని తినడం వల్ల మరింత టేస్ట్ గా ఉంటాయి. వీటితోపాటు మరిన్ని పోషకాలు కూడా లభిస్తాయట.

# స్వల్పంగా తగ్గిన బంగారం ధర..



బంగారం పేరు వింటనేనే దడ పుట్టే పరిస్థితి వచ్చింది. ఆల్‌టైమ్ రికార్డ్‌తో గోల్డ్ ధరలు పరగులు పెడుతున్నాయి. కేవలం రెండు నెలల్లోనే సుమారు రూ. 15 వేల వరకు బంగారం ధర పెరగడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. అంతర్జాతీయ మార్కెట్లో నెలకొన్న పరిస్థితులు, యుద్ధ వాతావరణ నేపథ్యంలో గోల్డ్ ధరలు జెట్ స్పీడ్‌తో దూసుకుపోతున్నాయి. ఇక ఈ ఏడాది చివిర నాటికి తులం బంగారం ధర కచ్చితంగా రూ. 80 వేల వరకు చేరుకోవడం స్పష్టంగా కనిపిస్తోంది. ఇదిలా ఉంటే వరుసగా ప్రతీ రోజూ పెరుగుతూ వచ్చిన బంగారం ధరలకు గత రెండు రోజులుగా బ్రేకులు పడుతున్నాయి. సోమవారం స్వల్పంగా తగ్గి బంగారం ధర మంగళవారం మరోసారి తగ్గుముఖం పట్టింది. దేశవ్యాప్తంగా పలు ప్రధాన నగరల్లో బంగారం ధరలో కాస్త తగ్గుదల కనిపించింది. మరి ఈ రోజు దేశంలోని పలు ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయో ఇప్పుడు చూద్దాం.. దేశ రాజధాని న్యూఢిల్లీలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 67,690కాగా, 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ. 73,830గా ఉంది. ఇక ముంబయిలో 22 క్యారెట్ల ధర రూ. 67,540, 24 క్యారెట్ల ధర రూ. 73,680 వద్ద కొనసాగుతోంది. అలాగే చెన్నైలో 22 క్యారెట్ల గోల్డ్ ధర రూ. 68,440, 24 క్యారెట్ల ధర రూ. 74,660 వద్ద కొనసాగుతోంది. బెంగళూరులో 22 క్యారెట్ల ధర రూ. 67,540 కాగా, 24 క్యారెట్ల బంగారం ధర రూ. 73,689 వద్ద కొనసాగుతోంది. ఇక తెలుగు రాష్ట్రాల విషయానికొస్తే హైదరాబాద్‌లో ఈరోజు 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ. 67,540కాగా, 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ. 73,689 వద్ద కొనసాగుతోంది. ఇక విజయవాడతోపాటు విశాఖపట్నంలోనూ ఇదే ధరలు కొనసాగుతున్నాయి. ఇదిలా ఉంటే వెండి ధరలు కూడా తగ్గుముఖం పట్టాయి. దేశంలోని పలు ప్రధాన నగరాల్లో ఈరోజు కిలో వెండిపై రూ. 100 వరకు తగ్గింది. దీంతో ఢిల్లీతో పాటు ముంబయి, కోల్‌కతా, పుణె వంటి నగరాల్లో కిలో వెండి ధర రూ. 85,400గా ఉంది. అలాగే చెన్నై, కేరళ, హైదరాబాద్, విజయావడ, విశాఖపట్నంలో కిలో వెండి ధర అత్యధికంగా రూ. 88,900 వద్ద కొనసాగుతోంది.

# కంటి ఆరోగ్యం మెరుగుపడాలంటే?



ఈ రోజుల్లో చాలా మందికి కూడా చిన్న వయసులోనే కంటి సమస్యలు వస్తున్నాయి. అందుకే క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి. ఎందుకంటే కంటి పరీక్షలు చేయించుకోవడం వల్ల ఏవైనా కంటి సమస్యలు ఉంటే మనం స్టార్టింగ్ స్టేజ్ గుర్తించవచ్చు. దీంతో మనం తగిన జాగ్రత్తలు తీసుకోవడం వల్ల సమస్య మరింత తీవ్రతరం కాకుండా ఉంటుంది. ముఖ్యంగా మన చేతులతో తరుచూ కళ్లను తాకకూడదు. కళ్లను రుద్దకూడదు. అవసరమైతే మన చేతులను శుభ్రంగా కడిగి ఆ తరువాత కళ్లను తాకడం మంచిది. చేతులపై అనేక రకాల వైరస్, బ్యాక్టీరియాలు ఉండే అవకాశం ఉంటుంది. అదే చేతులతో కళ్లను తాకడం వల్ల కంటికి ఇన్ఫెక్షన్ లు వచ్చే అవకాశం ఉంది. కనుక చేతులను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుకోవడం మంచిది. అలాగే కళ్లు పొడిబారకుండా ఉండడానికి గానూ రోజూ తగినన్ని నీళ్లు తాగడం చాలా అవసరం. నీరు తాగడం వల్ల కళ్లు పొడిబారకుండా ఉండడంతో పాటు కళ్ల ఎరుపుదనం కూడా తగ్గుతుంది. అలాగే రోజూ కంటి వ్యాయామాలు చేయడం కూడా చాలా అవసరం. కంటి వ్యాయామాలు చేయడం వల్ల కంటి కండరాలు బలంగా తయారవుతాయి. దీంతో కంటిచూపు మెరుగుపడుతుంది. కంటి ఆరోగ్యం మెరుగుపడి దృష్టి లోపాలు తగ్గాలంటే టివి, సెల్ ఫోన్ వంటి వస్తువుల వాడకాన్ని తగ్గించడంతో పాటు సరైన ఆహారాన్ని తీసుకోవడం కూడా చాలా ముఖ్యం. కంటి ఆరోగ్యం మరియు చూపు మెరుగుపడాలంటే మనం తీసుకోవాల్సిన ఆహారాలతో పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కూడా ఇప్పుడు తెలుసుకుందాం. కంటి ఆరోగ్యం మెరుగుపడాలంటే పోషకాలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం చాలా ముఖ్యం. క్యారెట్, ఆకుకూరలు, సిట్రస్ పండ్లు, గింజలతో పాటు జింక్, కాపర్, విటమిన్స్, మినరల్స్ ఎక్కువగా ఉండే ఆహారాలను తీసుకోవడం చాలా ముఖ్యం. మన శరీరంలో కళ్లు ముఖ్యమైన అవయవాలు. ఇవి మన జీవితంలో చాలా ముఖ్య పాత్రను పోషిస్తాయని చెప్పవచ్చు. మన శరీర ఆరోగ్య కోసం ఎంత శ్రద్ధ తీసుకుంటామో మన కళ్ల ఆరోగ్యం గురించి కూడా అంతే శ్రద్ధ తీసుకోవాలి. కాబట్టి ఖచ్చితంగా పైన తెలిపిన జాగ్రత్తలు ఖచ్చితంగా తీసుకోండి. కళ్ళని ఆరోగ్యంగా ఉంచుకోండి.

# రాణించిన సూచీలు.. 22,300 ఎగువకు నిఫ్టీ



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలతో మన సూచీలూ రాణించాయి. ముఖ్యంగా ప్రైవేటు బ్యాంకులు, ఇన్‌ఫ్రా స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు సూచీలకు కలిసొచ్చింది. దీంతో సూచీలు వరుసగా రెండోరోజూ రాణించాయి. సెన్సెక్స్ 560 పాయింట్లు లాభపడగా.. నిఫ్టీ 22,300 పాయింట్ల ఎగువన ముగిసింది. సెన్సెక్స్ ఉదయం 73,666.51 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఆద్యంతం అదే ఒరవడిని కొనసాగించింది. ఇంట్రాడేలో 73,227.32 - 73,767.80 మధ్య కదలాడిన సూచీ.. 560.29 పాయింట్లు లాభపడి 73,648.62 వద్ద ముగిసింది. నిఫ్టీ 189.40 పాయింట్లు లాభపడి 22,336.40 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 83.36గా ఉంది. సెన్సెక్స్‌లో ఎల్అండ్‌టీ, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, అల్ట్రాటెక్ సిమెంట్, విప్రో షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. ఎన్టీపీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఇండస్ ఇండ్ బ్యాంక్, టాటా స్టీల్ ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ రకం బ్యారెల్ చమురు ధర 86.74 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. రూ.18వేల కోట్ల నిధుల సమీకరణలో భాగంగా ఫాలో ఆన్ పబ్లిక్ ఆఫర్‌కు వచ్చిన వొడాఫోన్ చివరిరోజు 6.92 రెట్లు (సాయంత్రం 3.50 గంటల సమయానికి) సబ్‌స్క్రైబ్ అయ్యింది. క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్ల నుంచి 19.20 రెట్లు, నాన్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లు 4.52 రెట్లు స్పందన లభించింది. రిటైల్ పోర్షన్ మాత్రం 0.92 శాతమే సబ్‌స్క్రైబ్ అయ్యింది.

# కళ్లు ఉప్పు వాడుతున్నారా?



వంటల్లో సుగంధ ద్రవ్యాలను వాడినా, ఖరీదైన మసాలాలను వాడినా కూడా ఉప్పు, కారం సరిగ్గా సరిపోకుంటే మాత్రం రుచిగా ఉండదు.. ఉప్పును సరిపడా వేసుకుంటేనే ఆ వంటలు రుచిగా ఉంటాయి..అయితే కొంతమంది సాల్ట్ ను వాడితే, మరికొందరు కళ్లు ఉప్పును ఎక్కువగా వాడుతారు.. అయితే కళ్లు ఉప్పును వాడే వారు కొన్ని విషయాలను తప్పక తెలుసుకోవాలని నిపుణులు చెబుతున్నారు.. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం..ఈ ఉప్పును ఎక్కువగా ఆయుర్వేద మందుల తయారీలో ఉపయోగిస్తున్నారు. ఈ ఉప్పులో మెగ్నీషియం, పొటాషియం ఎక్కువగా ఉంటాయి. జీర్ణక్రియ మెరుగు పరిచి తీసుకున్న ఆహారం బాగా జీర్ణం అయ్యేలా చేసి కడుపుకు సంబంధించిన సమస్యలు ఏమీ లేకుండా చేస్తుంది.. ఈ ఉప్పులో ఉండే పోటాషియం రక్త పోటును నియంత్రిస్తుంది.. శరీరంలో రోగనిరోధక వ్యవస్థ బలంగా ఉండేలా చేస్తుంది.. అలాగే నిద్రలేమి సమస్యలను తగ్గిస్తుంది. ఈ ఎండాకాలంలో డీహైడ్రేషన్ అవ్వకుండా చేస్తుంది.. ఒక గ్లాస్ గోరువెచ్చని నీటిలో అర స్పూన్ ఉప్పును కలిపి బాగా కరిగాక తాగితే మానసిక ఒత్తిడి దూరమై ప్రశాంతత కలుగుతుంది. స్నానం చేసే నీటిలో ఈ ఉప్పును వేసి స్నానం చేస్తే చర్మంపై ఉన్న మురికి త్వరగా పోతుంది.. అలాగే షాంపులో కాస్త ఉప్పు వేసి తల స్నానం చేస్తే జుట్టు రాలే సమస్యలు కూడా తగ్గిపోతాయి.. గొంతు ఇన్ఫెక్షన్స్ రాకుండా చేస్తుంది. ఇంకా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు అంటున్నారు.

# గుకేశ్‌కు టైటిల్ అతి పిన్న వయస్కుడిగా రికార్డు



క్యాండిడేట్స్ చెస్ టోర్నమెంట్ టైటిల్‌ను 17ఏళ్ల భారత గ్రాండ్‌మాస్టర్ డి గుకేశ్ చేజిక్కించుకొని చరిత్ర సృష్టించాడు. ప్రపంచ టైటిల్‌ను చేజిక్కించుకున్న అతి పిన్న వయస్కుడిగా గుకేశ్ నిలిచాడు. ప్రపంచ ఛాంపియన్ టైటిల్ కోసం చైనాకు చెందిన డింగ్ లిరెన్‌తో తలపడనున్నాడు. గుకేశ్ కంటే ముందు 1984లో రష్యా ఆటగాడు గ్యారీ కాస్పరోవ్ ఈ టోర్నమెంట్‌ను 22 ఏళ్ల అతి పిన్న వయసులో గెలుచుకున్నాడు. సోమవారం జరిగిన 14వ, చివరి రౌండ్‌లో గుకేశ్.. అమెరికాకు చెందిన హికారు నకమురాతో గేమ్‌ను డ్రా చేసుకొన్నాడు. దీంతో 9పాయింట్లతో గ్రూప్ టాపర్‌గా నిలిచాడు. అదే సమయంలో, అతను ఫ్రాన్స్‌కు చెందిన ఫిరోజా అలిరెజాను ఓడించడం ద్వారా తన పాయింట్లను 8.5కి పెంచుకున్నాడు. అలీరెజా ఓటమితో, గుకేష్ టోర్నమెంట్‌లో నెపోమ్నియాచి, నకమురా, అమెరికాకు చెందిన ఫాబియానో కరువానాపై అర పాయింట్ ఆధిక్యం సాధించాడు. ఇక మహిళల టైటిల్‌ను టాంగ్ జోంగీ(చైనా) 7.5పాయింట్లు చేజిక్కించుకుంది. చివరి రౌండ్ గేమ్‌ను ఆమె డ్రా చేసుకొంది. ఇక భారత మహిళా గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి(2546పాయింట్లు) 2 స్థానంలో, ఆర్. వైశాలి(2475పాయింట్లు) 6.5పాయింట్లతో 7 వస్థానంలో నిలిచారు. ఈ టోర్నీ గెలిచిన రెండో భారతీయుడు గుకేశ్ రికార్డ్ నెలకొల్పాడు. అతనికి ముందు ఐదుసార్లు ప్రపంచ ఛాంపియన్ విశ్వనాథన్ ఆనంద్ 2014లో ఈ టోర్నీని గెలుచుకున్నాడు. అప్పుడు అతని వయస్సు 45 సంవత్సరాలు. విజయం అనంతరం గుకేశ్ మాట్లాడుతూ.. 'నేను చాలా సంతోషంగా ఉన్నాను. నేను ఆ ఉత్తేజకరమైన గేమ్‌ను చూస్తున్నాను (ఫ్యాబియో కరువానా, ఐయోన్ నెపోమ్నియాచ్చి మధ్య), అప్పుడు నేను నా సహాద్యోగి (గ్రిగరీ గజెవ్‌స్కీ)తో కలిసి నడకకు వెళ్లానంటూ చెప్పుకొచ్చాడు. అది సహాయపడిందని నేను భావిస్తున్నాను అంటూ తెలిపాడు. ఆసియా క్రీడల్లో రజతం సాధించిన జట్టులో సభ్యుడైన గుకేశ్.. గతేడాది చైనాలో జరిగిన హాంగ్జౌ ఆసియా క్రీడల్లో రజత పతకం సాధించాడు. 2019లో భారతదేశపు అతి పిన్న వయస్కుడిగా, ప్రపంచంలో రెండవ అతి పిన్న వయస్కుడైన గ్రాండ్‌మాస్టర్ అయ్యాడు. విజేతగా నిలిచిన గుకేశ్ రూ.78.5 లక్షల నగదు బహుమతి దక్కింది.

# జైస్వాల్ సెంచరీ... ముంబయిపై తొమ్మిది వికెట్ల తేడాతో రాజస్తాన్ గెలుపు



సీజన్-17 ఐపిఎల్‌లో రాజస్తాన్ రాయల్స్ జట్టు వరుస విజయాలతో దూసుకెళ్తోంది. సవారు మాన్‌సింగ్ స్టేడియంలో సోమవారం ముంబయి ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రాజస్తాన్ 9వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ముంబయిను తిలక్ వర్మ ఆదుకోవడంతో నిర్ణీత 20 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 179పరుగులు చేసింది. హైదరాబాద్ బ్యాటర్ తిలక్ వర్మ(65) అర్ధసెంచరీతో రాణించాడు. ఆ లక్ష్యాన్ని రాజస్తాన్ జట్టు ఓపెనర్ యశస్వి జైస్వాల్(104) అజేయ సెంచరీతో రాణించడంతో 18.4ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. టాస్ గెలిచిన బ్యాటింగ్‌కు దిగిన ముంబరును సందీప్ శర్మ (5/18) అద్భుత స్పెల్‌తో కట్టడి చేశాడు. తొలుత డేంజరస్ ఇషాన్ కిషన్(0), సూర్యకుమార్ యాదవ్(10)లను వెనక్కి పంపి ముంబయిని కష్టాల్లోకి నెట్టాడు. తిలక్ వర్మ(65), నేహల్ వధేరా(49) ఆదుకున్నారు. ఐదో వికెట్‌కు వీరు 99 పరుగులు జోడించారు. రాజస్తాన్ పేసర్ అనంతరం రాజస్తాన్ ఓపెనర్లు జైస్వాల్ సెంచరీకి తోడు బట్లర్(35), సంజు(38) బ్యాటింగ్‌లో రాణించారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ సందీప్ శర్మకు లభించింది.

# పంజాబ్ కెప్టెన్ పై సెహ్వాగ్ విమర్శలు?




ఇండియన్ ప్రీమియర్ లీగ్ ఎంటర్టైన్మెంట్ ప్రస్తుతం ప్రేక్షకులందరికీ టీవీలకు అతుక్కుపోయేలా చేస్తుంది. ఇంకొంత మంది ప్రేక్షకులను స్టేడియం కు తరలి వచ్చేలా ప్రభావితం చేయడంలో సక్సెస్ అవుతుంది.ప్రస్తుతం దేశంలో ఎక్కడ చూసినా కూడా ఈ ఐపీఎల్ హడావిడినే కనిపిస్తుంది. ఒక రకంగా చెప్పాలంటే దేశవ్యాప్తంగా క్రికెట్ పండుగ కొనసాగుతూ ఉంది అని చెప్పాలి. ఇక ప్రతి మ్యాచ్ కన్నార్పకుండా వీక్షిస్తూ అసలు సిసలైన క్రికెట్ మజాని పొందుతున్నారు ప్రేక్షకులు. ఇక అన్ని టీమ్స్ కూడా టైటిల్ పోరులో దూసుకుపోతూ అదిరిపోయే ప్రదర్శన చేస్తూ ఉన్నాయి. అయితే కొన్ని టీమ్స్ మాత్రం టైటిల్ ఫేవరెట్ గా బరిలోకి దిగి చివరికి నిరాశ పరుస్తూ ఉన్నాయి అని చెప్పాలి. ఇలాంటి టీమ్స్ లో అటు పంజాబ్ కింగ్స్ జట్టు కూడా ఒకటి. ఇప్పుడు వరకు 8 మ్యాచ్ లు ఆడిన పంజాబ్ కింగ్స్ జట్టు.. కేవలం రెండు మ్యాచ్లలో మాత్రమే విజయం సాధించింది. దీంతో పాయింట్ల పట్టికలో చివరి నుంచి రెండవ స్థానంలో కొనసాగుతూ ఉండడం గమానార్హం. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే ఆ టీం ప్లే ఆఫ్ లోకి వెళ్లడం దాదాపు అసాధ్యం అన్న విషయం అర్థమవుతుంది. అయితే ప్రస్తుతం రెగ్యులర్ కెప్టెన్ ధావన్ అందుబాటులో లేకపోవడంతో ఆల్రౌండర్ సామ్కరణ్ కెప్టెన్సీ అందుకున్నాడు. అయితే అతని కెప్టెన్సీ తో మాత్రం తీవ్ర స్థాయిలో విమర్శలు ఎదుర్కొంటున్నాడు అని చెప్పాలి. ఈ క్రమంలోనే పంజాబ్ కింగ్స్ కెప్టెన్ సామ్కరణ్ పై టీమిండియా మాజీ ప్లేయర్ వీరేంద్ర సెహ్వాగ్ విమర్శలు గుప్పించాడు. ఒకవేళ తాను అయితే కరన్ కు ఆల్రౌండర్ గా జట్టులో చోటు ఇవ్వను అంటూ తేల్చి చెప్పాడు. ఆల్రౌండర్ అంటే బౌలింగ్ లోనో బ్యాటింగ్ లోను జట్టును గెలిపించాలి. కానీ ఏ విభాగంలోనూ ఆడని ఆటగాడితో ఎలాంటి ఉపయోగం లేదు అంటూ కాస్త ఘాటుగానే విమర్శల గుప్పించాడు వీరేంద్ర సెహ్వాగ్.

# బార్సిలోనా టెన్నిస్ విజేత రూడ్ ఫైనల్లో సిట్సిపాస్‌పై గెలుపు



బార్సిలోనా టెన్నిస్ టోర్నీ టైటిల్‌ను 6వ సీడ్, నార్వేకు చెందిన కాస్పర్ రూఢ్ చేజిక్కించకుఉన్నాడు. ఆదివారం అర్ధరాత్రి జరిగిన ఫైనల్లో రూఢ్ 7-5, 6-3తో వరుససెట్లలో 7వ సీడ్ గ్రీక్‌కు చెందిన స్టెఫోనిస్ సిట్సిపాస్‌ను చిత్తుచేశాడు. తొలి సెట్ ఇరువురు ఆటగాళ్లు చేసిక్కించుకొనేందుకు పోటాపోటీగా తలపడ్డారు. కానీ ఒక బ్రేక్ పాయింట్ సాధించి రూఢ్ ఆ సెట్‌ను చేజిక్కించుకోగా.. రెండో సెట్‌లో తొలుత రెండు బ్రేక్ పాయింట్లను కొల్లగొట్టి సునాయాసంగా ఆ సెట్‌నూ కైవసం చేసుకోవడంతోపాటు టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. దీంతో గత వారం మోంటే కార్లో ఫైనల్లో సిట్సిపాస్ చేతిలో ఓటమికి రూఢ్ బదులు తీర్చుకున్నాడు. మూడు సార్లు గ్రాండ్‌స్లామ్ టైటిల్ రన్నరప్ అయిన రూఢ్.. క్లేకోర్ట్ ఈవెంట్-250లో 10 టైటిళ్లను తన ఖాతాలో వేసుకోగా.. తాజాఆ మరో టైటిల్‌ను జతచేసి 11వ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. ఈ టైటిల్‌ను చేజిక్కించుకోవడానికి ముందు రూఢ్ మూడు టోర్నీల్లో ఫైనల్‌కు చేరినా.. రన్నరప్‌గానే నిలిచాడు.

# మారుతీ టీం బ్యూటీ సినిమా ప్రారంభం



ఈ రోజుల్లో, బస్ స్టాప్ లాంటి చిన్న బడ్జెట్ సినిమాలతో బ్లాక్ బస్టర్ విజయాలు సాధించిన దర్శకుడు మారుతి. ఆ తరువాత కూడా ఈ డైరెక్టర్ డైరెక్షన్ లో వచ్చిన ఎన్నో చిత్రాలు సూపర్ హిట్ గా నిలిచాయి. నానికి భలే భలే మగాడివోయ్ శర్వానంద్ కి మహానుభావుడు లాంటి మంచి విజయాలను అందించారు దర్శకుడు మారుతి. ఈ క్రమంలో ఇప్పుడు ప్రభాస్ ది రాజా సాబ్ సినిమాతో పాన్ ఇండియా మార్కెట్లోకి అడుగుపెట్టనున్నారు. ఈ సినిమాలో డార్లింగ్ ప్రభాస్ ని చూడబోతున్నామని రెబల్ స్టార్ అభిమానులు తెగ నమ్మకంతో ఉన్నారు. ఈ క్రమంలో ఈ చిత్రంపై రోజురోజుకీ అంచనాలు పెరిగిపోతున్నాయి. అయితే మారుతి ఇప్పుడు దర్శకునిగానే కాకుండా నిర్మాతగా కూడా త్వరలోనే మంచి విజయం సాధించడానికి సిద్ధమైపోయారు.డైరెక్టర్ మారుతి టీమ్ ప్రోడక్ట్, వానరా సెల్యూలాయిడ్ సంయుక్త నిర్మాణంలో రావు రమేష్ ప్రధాన పాత్రలో బ్యూటీ అనే సినిమా రానుంది. అంకిత్ కొయ్య, విశాఖ ధిమన్ హీరో హీరోయిన్లుగా బాల సుబ్రహ్మణ్యమ్ దర్శకత్వంలో ఎ.విజయ్ పాల్ రెడ్డి నిర్మాతగా ప్రకాష్ రౌతు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ గా తెరకెక్కుతున్న ఈ చిత్ర షూటింగ్ మొదలయ్యింది.ఏప్రిల్ 22వ తేదీన హైదరాబాదులోని ఫిలింనగర్ దైవ సన్నిధానంలో ఈ సినిమా పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ సినిమాకు దర్శకుడు మారుతి క్లాప్ కొట్టగా, మరో దర్శకుడు బుచ్చిబాబు కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ఈ కార్యక్రమంలో దర్శకులు వీర శంకర్, సుబ్బు మంగాదేవి, డార్లింగ్ స్వామి తదితరులు పాల్గొన్నారు. లవ్ అండ్ ఫ్యామిలీ ఎమోషనల్ గా తెరకెక్కబోతున్న బ్యూటీ చిత్రం మే రెండు నుండి హైదరాబాద్ పరిసర పాంతాల్లో షూటింగ్ జరుపుకుంటుందని నిర్మాతలు తెలిపాడు.

# వాళ్లతో గొడవ పడటం మంచిది కాదు



వలసల సమయంలో జనాభా విస్తరించడం గురించి దర్శకుడు పూరి జగన్నాథ్ మాట్లాడారు. యూట్యూబ్ వేదికగా వివిధ అంశాలపై తన అభిప్రాయాన్ని పంచుకుంటున్న పూరి.. తాజాగా మరో ఆసక్తికర విషయంతో ముందుకొచ్చారు. 'పూరి మ్యూజింగ్స్'లో భాగంగా ఈసారి చైనీస్, జపనీస్ గురించి మాట్లాడారు.'వలసల సమయంలో మనుషులు ప్రపంచమంతా విస్తరించారు. కొంతమంది యూరప్ చేరుకుంటే మరికొందరు భారత్‌కు వచ్చారు. ఇంకొంతమంది మాత్రం హిమాలయాల వెనక ఏముందో చూడాలని దాన్ని ఎక్కే ప్రయత్నం చేశారు. ఆ ప్రయత్నంలో వారంతా కొన్ని వందల సంవత్సరాలు ఆ మంచుకొండల్లోనే బతకాల్సి వచ్చింది. మంచులో ఉండే జంతువులను వేటాడుతూ.. వాటి చర్మంతో చేసిన దుస్తులు వేసుకొని బతికారు. వాళ్లకు సరైన పౌష్టికాహారం దొరక్క ఎముకల్లో ఎదుగుదల లోపించి పొట్టిగా తయారయ్యారు. ఆ చలికి సూర్యుడిని చూడలేక కళ్లు చిన్నవిగా చేసుకొని చూడడం ప్రారంభించారు. కాలక్రమేణా వాళ్ల కళ్లు చిన్నవిగా మారిపోయాయి. దీన్నే 'ఎపికాంథిక్ ఫోల్డ్' అంటారు. ఛాలెంజింగ్ వాతావరణంలో వాళ్ల రూపురేఖలు మారిపోయి తెల్లగా.. పొట్టిగా.. చిన్న కళ్లతో ఒక జాతి తయారైంది. ఆ జాతి కొన్ని రోజులకు హిమాలయాలు దిగి అటూ..ఇటూ.. వెళ్లిపోయి స్థిరపడింది. వాళ్లే జపనీస్, చైనీస్, కొరియన్స్'. 'అదే సమయంలో భారత్ వచ్చి అడవుల్లో తిరిగిన మనుషులంతా ఎప్పుడు.. ఏ జంతువు దాడి చేస్తుందా అని అనుక్షణం కళ్లు తెరుచుకొని బతికారు. అందుకే మనకు కళ్లు పెద్దవిగా ఉంటాయి. అయితే, 'ఎపికాంథిక్ ఫోల్డ్' ఉన్న మనుషులు చాలా బలవంతులు. వాళ్ల డీఎన్ఏ మారిపోయింది. కఠినమైన వాతావరణంలోను బతకడం నేర్చుకున్నారు. వీళ్లందరూ మానసికంగా కూడా దృఢంగా.. ఎప్పుడూ మౌనంగా ఉంటారు. ఒంటరితనం అని అనిపించదు. ఓపిక, సహనం వాళ్ల రక్తంలో ఉంటాయి. మానవ సంబంధాలకు విలువనిస్తారు. వాళ్లతో గొడవ పెట్టుకోవడం అంత మంచిది కాదు.

# నాకు కారు లేదు.. అమ్మేశా



ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేయడం కోసం పోలింగ్ కేంద్రానికి నటుడు విశాల్ సైకిల్‌పై రావడం అంతటా వైరల్‌గా మారిన విషయం తెలిసిందే.హీరో విజయ్‌ను స్ఫూర్తిగా తీసుకునే ఆయన ఈవిధంగా చేశారని చాలామంది మాట్లాడుకున్నారు. ఈ విషయంపై తాజాగా జరిగిన 'రత్నం' ఈవెంట్‌లో విశాల్ స్పందించారు. అందరూ అనుకుంటున్నట్లు తాను విజయ్‌ను ఫాలో కాలేదన్నారు.

"విజయ్ అంటే నాకెంతో ఇష్టం. ఎన్నో ఇబ్బందులు, అవమానాలు ఎదుర్కొని అతడు ఈ స్థాయికి వచ్చాడు. విమర్శలు వచ్చినప్పుడు మానసికంగా కుంగుబాటుకు గురవుతాం. ఆ బాధను తట్టుకుని స్టార్‌గా ఎదగడం సాధారణ విషయం కాదు. అందుకే అతడంటే నాకెంతో ఇష్టం. వ్యక్తిగత కారణాల వల్ల ఆరోజు పోలింగ్ కేంద్రానికి సైకిల్‌పై వెళ్లా. విజయ్‌ను ఇమిటేట్ చేయడం కోసం అలా చేయలేదు. ప్రస్తుతం నా తల్లిదండ్రులకు మాత్రమే కారు ఉంది. నాకు లేదు. కొంతకాలం క్రితం అమ్మేశా. నగరంలో రోడ్లు దారుణంగా ఉన్నాయి. సైకిల్‌పై అయితే ఎటువంటి ఇబ్బందిలేకుండా ప్రశాంతంగా ప్రయాణించవచ్చు అనిపించింది" అని అన్నారు. అనంతరం పెళ్లి గురించి మాట్లాడుతూ.. "నేను తప్పకుండా పెళ్లి చేసుకుంటా. ఇంట్లోవాళ్లందరూ నా పెళ్లి కోసమే ఎదురుచూస్తున్నారు. సౌత్ ఇండియన్ ఆర్టిస్ట్ అసోసియేషన్ కోసం భవనం నిర్మించిన వెంటనే పెళ్లి చేసుకుంటా. ప్రస్తుతం అది నిర్మాణదశలో ఉంది. ఆ భగవంతుడు నాకోసం ఒక అమ్మాయిని పుట్టించే ఉంటాడు. తప్పకుండా ఆమె నాకోసం ఎదురుచూస్తుంటుంది" అని తెలిపారు. తాను రాజకీయాల్లోకి వస్తానని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో తప్పకుండా పోటీ చేస్తానన్నారు.

# 25 సెంటర్లలో వంద రోజులు



క్రియేటివ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ, తేజ సజ్జా పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్ 'హను-మాన్' 25 కేంద్రాలలో 100 రోజుల రన్ పూర్తి చేసుకుంది.ఏ మాత్రం అంచనాల్లేకుండా సంక్రాంతి కానుకగా వచ్చిన ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్టయింది. గుంటూరుకారం లాంటి సినిమాల్ని కూడా అధిగమించి సిసలైన బ్లాక్ బస్టర్ అనిపించుకుంది.ఇప్పుడీ సినిమా 25 కేంద్రాల్లో వంద రోజులు పూర్తిచేసుకోవడం మరో పెద్ద ఫీట్. ఓ సినిమా 2-3 వారాలు నిలబడ్డమే గగనంగా ఉన్న ఈ రోజుల్లో హనుమాన్ సినిమా ఏకంగా వంద రోజులాడి సంచలనం సృష్టించింది.92 ఏళ్ల టాలీవుడ్ చరిత్రలో హను-మాన్ ఆల్ టైమ్ సంక్రాంతి బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఈ ఫాంటసీ అడ్వెంచర్ ప్రపంచవ్యాప్తంగా 300 కోట్ల రూపాయల గ్రాస్ సాధించింది. ఓవర్సీస్‌లో 5 మిలియన్లకు పైగా కలెక్షన్లు రాబట్టింది. రీజనబుల్ టిక్కెట్ ధరలు ఉన్నప్పటికీ, హను-మాన్ అనేక బాక్సాఫీస్ రికార్డులను బద్దలు కొట్టింది. ఈ చిత్రం పాన్ ఇండియా లెవెల్లో విడుదలైంది. ఇది హిందీతో సహా అన్ని భాషలలో కమర్షియల్ హిట్‌గా నిలిచింది. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్ పై నిరంజన్ రెడ్డి ఈ సినిమాను నిర్మించాడు. 28వ తేదీన జీ తెలుగులో ఈ సినిమాను టెలికాస్ట్ చేయబోతున్నారు.

"PEN SATTA" Telugu Daily Printed, Published and owned by CHINTAMANENI ANILKUMAR, D.NO.1-1, RAJULA ILLA PAKKANA,VENKATAPURAM, THANAM POST, MUNAGAPAKA MANDAL, ANAKAPALLI, VISAKHAPATNAM, ANDHRAPRADESH-531021. Published at D.NO.1-1, RAJULA ILLA PAKKANA,VENKATAPURAM, THANAM POST, MUNAGAPAKA MANDAL, ANAKAPALLI, VISAKHAPATNAM, ANDHRAPRADESH-531021. and Printed at Chaitanya Vaaradhi Printers, Do.No.2-99, Bharinikam, Paravada, Anakapalli, Visakhapatnam-531 021. Editor : CHINTAMANENI ANILKUMAR, D.NO.1-1, RAJULA ILLA PAKKANA,VENKATAPURAM, THANAM POST, MUNAGAPAKA MANDAL, ANAKAPALLI, VISAKHAPATNAM, ANDHRAPRADESH-531021. Cell : 98853 15759, RNI.NO.APTEL16333 T-C, E-mail:anilchintamaneni@gmail.com